క్లుప్తంగా

సీఎస్ఐ చర్చిలో ఘనంగా కోత పండుగ



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో ఆదివారం కోత పండుగను(కృతజ్ఞతార్పణల పండుగ) ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో చర్చి డీనరీ చైర్మన్ ఎస్.పాల్‌రాజు ప్రసంగించారు. దేవునికి సమర్పించిన వస్తువులు, పండ్లను వేలం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణా, గోదావరి డయోసిస్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాకలపాటి కనకరాజు, ఎంపీపీ జోసఫ్, చర్చి ప్యారిష్ కమిటీ సెక్రటరీ జడ్‌జీ.సుందరరావు, ట్రెజరర్ ఎం. దేవరాజు, సభ్యులు కె.ప్రభాకర్ ప్రభూజీ, జె.కుమార్‌బాబు, స్త్రీల మైత్రి ప్రెసిడెంట్ ఆశాపాల్, సెక్రటరీ పి.ఉషాహరిణి, ఇతర కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సహకారంతో సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్లో ఆదివారం చిత్రలేఖన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 650 మంది చిన్నారులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. అనంతరం జరిగిన సభలో అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు మాట్లాడుతూ పిల్లలు చదువుల వెంటే పడకుండా ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సింగ్‌నగర్ బాధ్యులు సీహెచ్ పద్మ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు వెంకటరామరాజు, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఇ.క్రాంతి, ప్రముఖ చిత్రకారులు చిత్రం సుధీర్, సంధ్యారాణి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహిళా ఉత్సవ్-2025



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 తేదీ మొదలైన మహిళా ఉత్సవ్-2025 ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని సాధిస్తున్నారని చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన రుణాలు మంజూరు చేయడంతో పాటుగా రుణాల్లో సబ్సిడీలను కూడా కల్పిస్తోందని, ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కోరారు. మహిళా ఉత్సవ్ పేరుతో ఏటా ఈ విధంగా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించి అమ్మకాలు చేయడం అభినందనీయమని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా విక్రయించి వారి అభిరుచులను తెలుసుకునేందుకు మహిళా ఉత్సవ్ ఎంతగానో దోహదం చేసిందన్నారు. స్వయం ఉపాధి కోర్సులను నేర్చుకున్న మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడం వల్ల వారు ఉపాధి పొందడమే కాకుండా మరికొంత మందికి ఉపాధిని కల్పించవచ్చునని చెప్పారు. మహిళా ఉత్సవ్-2025లో స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి అతిధులు సర్టిఫికెట్లను అందచేశారు.

ఘనంగా ఘంటసాల వర్ధంతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొని ఘంటసాల జీవిత విశేషాలను వివరించారు. ఘంటసాల తెలుగు సినీ రంగంలో ఎంతో ఖ్యాతి గడించారని, ఆయన ఆలపించిన ఎన్నో మధుర గీతాలు నేటికీ అనేక మంది ఇళ్లల్లో మోగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఘంటసాల ఆలపించిన భగవద్గీత తెలుగునాట అత్యంత జనాదరణ పొందిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఘంటసాల జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఘంటసాల పాటలు ఆలపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె. రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టాల ఊబిలో మిర్చి రైతులు

- మిర్చిని ఆశించిన తామర పురుగు...
- తగ్గిన దిగుబడులు
- లభించని మద్దతు ధర
- గతేడాది క్వింటా రూ.20వేలు పైమాటే
- ప్రస్తుత రేటు రూ.10వేలు లోపే
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- తీవ్రనష్టాల్లో మిర్చిసాగు రైతులు



కల్లంలో ఆరబెట్టిన మిరపకాయలు



కంచికచర్ల మండలం గండేపల్లిలో సాగవుతున్న మిర్చి తోట

కంచికచర్ల: మిర్చిరైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. రైతులు ఎకరాకు లక్షన్నరకు పైగా ఖర్చుచేసి మిర్చిసాగు చేపట్టగా తామర తెగులు దెబ్బకు పంట దెబ్బతిని దిగబడులు తగ్గిపోయాయి. ఆదుకోవాల్సిన రాష్ట్రప్రభుత్వం చోద్యం చూస్తుండటం మిర్చిసాగు రైతుల పాలిట శాపంగా మారింది. దిగుబడులు తగ్గడంతోపాటు మిర్చికి మద్దతు ధర లభించకపోతుండటంపై రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

5,374 ఎకరాల్లో సాగు..

నందిగామ నియోజకవర్గంలోని రైతులు ఈ ఏడాది మొత్తం 5,374 ఎకరాల్లో మిర్చిసాగు చేపట్టారు. కంచికచర్ల మండలంలో 655ఎకరాలు, నందిగామ మండలంలో 3,070, వీరులపాడులో 899ఎకరాలు, చందర్లపాడు మండలంలో 750ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశారు. గతేడాదితో పోల్చితే ఈఏడాది సాగు విస్తీర్ణం తగ్గింది. గతేడాది 8వేల ఎకరాల్లో సాగుచేయగా, ఈసారి 5,374 ఎకరాలకే పరిమితమైందని వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

తెగుళ్ల దెబ్బకు విలవిల..

మిర్చి పంటకు ఈ ఏడాది తామర తెగులు ఆశించింది. లింగాకర్షక బుట్టలు పొలాల్లో పెట్టినప్పటికీ తామర తెగుళ్లు పంటను నాశనం చేస్తుండటంతో దిగుబడులు తగ్గిపోతున్నాయి. తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేసినా లాభంలేకపోయింది. తెగుళ్ల కారణంగా సాగు ఖర్చులు పెరిగాయని రైతులు వాపోతున్నారు.

దిగుబడులు..ధరలు రెండూ తగ్గింపే...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మిర్చి క్వింటా రూ.20వేలు పలకడంతో రైతులు లాభాలు కళ్లచూశారు. కాని ఈ ఏడాది తెగుళ్ల కారణంగా దిగుబడులు తగ్గినప్పటికీ క్వింటా మిర్చి ధర రూ.10వేలకు మించి అమ్మకపోతుండటం రైతులను మరింత కుంగదీసింది. మిర్చి దిగుబడులు అధికంగా ఉన్న గతేడాదే రూ.20వేలు పలికిన క్వింటా మిర్చి ధర, దిగుబడులు బాగా తగ్గినసమయంలోనూ ధర తగ్గిపోవడంపై దిగాలు చెందుతున్నారు. మిర్చి పంటకు మద్దతు ధర కల్పించి రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్రప్రభుత్వం ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో తీవ్రనష్టాల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా స్పందించి మిర్చికి మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ఆదిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన కౌలు ధరలు..

గతేడాది మిర్చిసాగులో అధిక దిగుబడులు సాధించడంతోపాటు క్వింటా ధర కూడా రూ.20వేలు వరకు పలకడంతో రైతులు లాభపడ్డారు. దీంతో ఈఏడాది భూముల కౌలు ధరలను భూయజమానులు అమాంతం పెంచేశారు. గతేడాది ఎకరా కౌలు రూ.20వేలు నుంచి రూ.25వేలు పలుకగా, ఈఏడాది రూ.30వేలు నుంచి రూ.35వేలు వరకు పలికింది. అదేవిధంగా నర్సరీల యజమానులు మిర్చి నారు ధరను సైతం పెంచడంతో ఈ ఏడాది సాగు వ్యయం భారీగా పెరిగింది. ఎకరాకి సాగు ఖర్చులు రూ.1.30వేల వరకు అయినట్లు రైతులు చెబుతుండగా, ఇక కౌలురైతులపై అదనంగా మరో రూ.30వేలు భారం పడింది.

తామర తెగుళ్లు ఆశించాయి..



నేను నాలుగు ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశా. పంటను తామర తెగులు ఆశించింది. తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన నీలిమందులను పిచకారీ చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. దిగుబడి మాత్రం తగ్గిపోవడంతోపాటు ధరలు కూడా లేవు. మద్దతు ధర కల్పిస్తేనే నష్టాల ఊబి నుంచి గట్టెక్కగలం.

– మర్రి వెంకటకృష్ణ,
రైతు, పేరకలపాడు, కంచికచర్ల మండలం

రైతులను ఆదుకోవాలి...



ఈ ఏడాది నేను14ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంటను సాగుచేశాను. గతేడాది ఎకరాకు 30క్వింటాళ్ల వరకు దిగబడి రాగా, ధర కూడా క్వింటాకు రూ.20వేలు నుంచి రూ.21వేలు వరకు పలికింది. ఈసారి దిగుబడులు తగ్గడంతోపాటు ధరలు కూడా లేకపోవడంతో నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి మిర్చి రైతులను ఆదుకోవాలి.

– మార్కపూడి అశోక్,
రైతు, గండేపల్లి, కంచికచర్ల మండలం

నేడు ఆలయ వార్షికోత్సవం

నందిగామరూరల్: మండలంలోని దాములూరులో వేంచేసియున్న రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ గణపతిపూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం, పుష్పార్చన, చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. రాత్రికి అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, గాదెల వెంకటరామారావు, సిద్దు, వీరబాబు కోరారు.

21న ధ్వజస్తంభ ప్రతిష్ట

చందర్లపాడు(నందిగామ రూరల్): మండలంలోని తోటరావులపాడులోని మౌలాలి నాగుల్‌మీరా స్వామి వారి దర్గాలో ఈనెల 21న ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పెరిగిశెట్టి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు పరిష్కార వేదిక రద్దు

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దయినట్లు డిప్యూటీ తహసీల్దార్ వేమూరి మానస ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వివరించారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

నటి కృష్ణవేణికి నివాళి

నందిగామటౌన్(నందిగామరూరల్): సినీనటి, నిర్మాత కృష్ణవేణి మృతి బాధాకరమని అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘ ఉపాధ్యక్షుడు వడ్డెల్లి సాంబశివరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం కృష్ణవేణి చిత్రపటానికి ఎన్టీఆర్ అభిమానులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 1949లో మనదేశం సినిమాతో ఎన్టీ రామారావుకు ఆమె అవకాశం కల్పించారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో అభిమానులు మహంకాళి కోటేశ్వరరావు, కర్రి వెంకటేశ్వరరావు, ఉద్దండుసాహెబ్, చందూరి బ్రహ్మం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



తీర్థప్రసాదాలు తీసుకుంటున్న భక్తులు

675 మందికి వైద్యపరీక్షలు



విద్యార్థికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు



వైద్యులుగా స్థిరపడి వైద్యశిబిరం నిర్వహించిన పూర్వవిద్యార్థులతో హెచ్‌ఎం క్రీస్తురాణి

కంచికచర్ల: స్థానిక విజయరాణి ఉన్నత పాఠశాలలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ కార్పొరేట్ వైద్యశాలల నిర్వాహకులైన పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

వైద్యులు పాల్గొని మొత్తం 675మందికి స్కిన్, కళ్లు, ఎముకలు, దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ క్రీస్తురాణి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యనభ్యసించి వైద్యవృత్తిలో ఉన్న పూర్వవిద్యార్థులు సామాజిక బాధ్యతతో వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. వారిని మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అద్భుత సృజనాత్మకత



చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న రచయిత సత్యవతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో అద్భుతమైన సృజనాత్మకత ఉంటుందని, దానిని వెలికితీస్తే ఉన్నత వంతులుగా తీర్చిదిద్దాలని తెలుగు రచయిత డాక్టర్ వి.సత్యవతి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, తెలుగు చిత్రకారులు దామెర్ల రామారావు శత వర్ధంతిని పురస్కరించుకుని ఆర్ట్ మేట్ విద్యార్థులచే తెలుగు భాష పై వేసిన చిత్రాల ప్రదర్శన ఆదివారం జరిగింది. గురునానక్‌కాలనీలోని ఆర్ట్ మేట్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ చిత్రకళా ప్రదర్శనను రచయిత సత్యవతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు భాషపై మొదటిసారిగా చిత్ర కళా ప్రదర్శన ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులను అభినందించారు. ఆర్ట్ మేట్ చిత్రకళ సంస్థ డైరెక్టర్ ఎ.సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రకళ పట్ల ఆసక్తిని కల్పించడంతో పాటు మన సంస్కృతిని తెలియచేడం ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్ననేని మురళీకృష్ణ పాల్గొనా, సీనియర్ చిత్రకారులు పావులూరి చిదంబరం , అమరావతి బాలోత్సవం కార్యదర్శి ఆర్. కొండలరావు, చిత్రకళ ప్రేమికులు ఎం.మధుసూదనరావు పాల్గొని ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుధారాణి, సుష్మా, స్వాతి, రజియా, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): స్థలం చుట్టూ కంచె వేస్తున్న తమపై ఇరువురు వ్యక్తులు దౌర్జన్యం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై ఆదివారం నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన పిల్ల దుర్గాప్రసాద్ ఫుట్‌వేర్ వ్యాపారం చేస్తుంటాడు. అదే వ్యాపారం చేస్తున్న కాపు మురళీకృష్ణకు దుర్గాప్రసాద్ రూ. 13.20 లక్షలు అప్పు ఇచ్చాడు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించేందుకు మురళీకృష్ణ డబ్బుకు బదులు నున్న వికాస్ కాలేజీ రోడ్డులో ఉన్న 10 సెంట్ల స్థలం రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఆ స్థలం చుట్టూ కంచె వేస్తుండగా దుర్గాప్రసాద్, అతని భార్య సత్యదేవిపై మురళీకృష్ణ, అతని భార్య సుజాత దౌర్జన్యం చేశారు. సత్యదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముమ్మరంగా తిరునాళ్ల ఏర్పాట్లు



దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం

నందిగామరూరల్: ఈనెల 25వతేదీ నుంచి నాలుగురోజులపాటు నిర్వహించనున్న తిరునాళ్ల మహోత్సవాలకు దాములూరు కూడలిలో వేంచేసియున్న పర్వతవర్ధిని సంగమేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. దక్షిణ కాశీగా పేరొందిన సంగమేశ్వరస్వామి ఆలయంలో ఏటా మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.తిరునాళ్లకు నియోజకవర్గం, పరిసర ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలి వస్తుంటారు.

ముమ్మర ఏర్పాట్లు..

శివరాత్రి మహోత్సవాల కోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.తిరునాళ్లకు పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాలను నిలుపుదల చేసేందుకు పంచాయతీ సిబ్బంది ఆలయం వెలుపల ఉన్న ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు, కంప చెట్లు తొలగిస్తున్నారు. ట్రాక్టర్, డోజర్‌తో ఖాళీస్థలాన్ని చదును చేస్తున్నారు. స్వామివారి కల్యాణం నిర్వహించనున్న మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు.



ఆలయంలో రంగులు వేస్తున్న సిబ్బంది



ఆలయం వద్ద ఖాళీస్థలాన్ని చదునుచేస్తున్న ట్రాక్టర్

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు ..



తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు సాగుతున్నాయి. పుణ్యస్నానాలు, పిండ ప్రదానాలకు సరిపడ వైరా కట్టలేరులో నీరుంది. భక్తులకు ఇబ్బంది లేకుండా జల్లు, తొట్టి స్నానాలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నాం. తిరునాళ్లను విజయవంతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం.

– నరసింహమూర్తి, ఆలయ ఈఓ

క్యాన్సర్ బాధితుల్లో 4 శాతం చిన్నారులే..

ఇంటర్నేషనల్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే సభలో డాక్టర్ వీణా అక్కినేని



క్యాన్సర్ నుంచి కోలుకున్న చిన్నారులతో రెయిన్‌బో వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తిస్తే చిన్నారుల్లో క్యాన్సర్‌ను నివారించవచ్చని క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ వీణ అక్కినేని అన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఆదివారం అంతర్జాతీయ బాల్య క్యాన్సర్‌డే సందర్భంగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడియాట్రిక్ హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని మాట్లాడుతూ దేశంలో క్యాన్సర్ బాధితుల్లో నాలుగు శాతం చిన్నారులేనన్నారు. చిన్నారుల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు క్రమంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, సకాలంలో చికిత్స అందిస్తే వారు కోలుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. తరచుగా జ్వరం, బరువు తగ్గడం, తలనొప్పి, ఉదయం వాంతులు చేసుకోవడం, కీళ్ళ నొప్పులు, కడుపు, మెడ,ఛాతీ, చంకల్లో వాపు వంటి లక్షణాలు చిన్న పిల్లల్లో ఉంటే వారిని వెంటనే వైద్యులకు చూపించాలన్నారు. వ్యాధి లక్షణాలను ముందుగా గమనిస్తే బాలలను క్యాన్సర్ బారి నుంచి కాపాడవచ్చని, ఈ వ్యాధి నివారణకు అత్యాధునిక వైద్య ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర చౌదరి మాట్లాడుతూ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే సందర్భంగా తమ ఆస్పత్రిలో గతంలో క్యాన్సర్ చికిత్స చేయించుకున్న చిన్నారులను వారి తల్లి తండ్రులతో సహా నేటి కార్యక్రమానికి ఆహ్వానించామన్నారు. క్యాన్సర్ నుంచి కోలుకున్న చిన్నారులు ఫ్యాన్సీ డ్రస్‌తో సహా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.

శ్రీకృష్ణదేవరాయలు ప్రజాపాలన ఆదర్శం

విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణదేవరాయలు ప్రజాపాలనను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు శీలం నాగేశ్వరరావు అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం దేవరాయలు 554వ జయంతి వేడుకలు, సంప్రదాయ నృత్యాలు, తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. శీలం నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు కవి పండిత పక్షపాతి అన్నారు. ఆయన రచించిన ఆముక్తమాల్యద గ్రంథం తెలుగు సాహిత్యంలో విశిష్టమైనదని పేర్కొన్నారు. కాపు సంఘం నాయకుడు మల్లెమూడి పిచ్చయ్య, సాహిత్య రంగానికి చెందిన డీ దత్తాత్రేయశర్మ, రామతీర్థ, డాక్టర్ బాలకృష్ణ, పవన్‌కుమార్‌రెడ్డి, సత్యబ్రహ్మచారి, డాక్టర్ పూర్ణచంద్రరావు, అంజయ్య, శివకుమార్, నాగరాజులకు పండిత సత్కారం నిర్వహించారు. భాగవతుల వెంకట్రామశర్మ బృందం పలు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. వివిధ రంగాలకు చెందిన అర్జా పాండురంగారావు, బొర్ర రామకృష్ణ, బొబ్బాది చంద్రశేఖర్, చలమలశెట్టి రమేష్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఉదయం బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.